క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబకు పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ఈవో జి.వి. రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి స్వయంగా జలాభిషేకం నిర్వహించారు. అర్చకుడు భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి విశేష పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం టీకాల కార్యక్రమం



రంగిరీజువీధి యూపీహెచ్‌సీ రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం రంగిరీజు వీధిలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. సిబ్బంది, వైద్యులు సమన్వయంతో పని చేయాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది విధిగా ముఖ హాజరు వేయాలని, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షిస్తున్న డాక్టర్ స్వర్ణలత

సీతంపేట: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సాలగ్రామపురం బ్రాంచిలో వీ డెంటల్, వీ హెల్త్ కేర్ సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బ్యాంక్ కస్టమర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలు ఉచితంగా పొందారు. బీపీ, షుగర్, దంత పరీక్షలు నిర్వహించారు. సుమారు వంద మంది కస్టమర్లు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ పి.ఎస్.ఎన్.మూర్తి, వీహెల్త్ కేర్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ పర్యవేక్షణలో డాక్టర్ వి.స్వర్ణలత, క్లినిక్ హెడ్ సి.హెచ్.కృష్ణ, వైద్య సిబ్బంది భారతి, లతీష, తులసి, లిఖిత్ సేవలందించారు.

రాములోరి కల్యాణానికి ఉత్సవ రాట



రామాలయంలో పెళ్లిరాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం పెళ్లిరాట ఉత్సవం నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం జరిపించనున్నారు. ఈ మేరకు పంచమిని పురస్కరించుకుని బుధవారం ఉదయం 8 గంటలకు నీరాటోత్సవాన్ని సంప్రదాయ సిద్ధంగా నిర్వహించి పెళ్లి రాట వేశారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మద్యం మత్తు.. బతుకు చిత్తు

- కుటుంబాల్లో చిచ్చు పెడుతున్న దురలవాటు
- విచక్షణ కోల్పోతున్న మందుబాబులు
- స్నేహితులు.. కుటుంబ సభ్యులపైనే దాడి

రామకృష్ణా రైతు మార్కెట్ వద్ద..



రాజారామ్మోహన్ రాయ్ రోడ్డులో..





పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు ఫుట్‌పాత్‌పై మందుబాబు



టౌన్ కొత్తరోడ్డు వద్ద..

దాబాగార్డెన్స్: మద్యం అనేక కుటుంబాలను అస్తవ్యస్తం చేస్తోంది. మద్యపానం చేసే వ్యక్తి కుటుంబ సభ్యులు, స్నేహితులకు దూరం అవుతున్నాడు. సమస్య మరింత జఠిలమైతే గొడవలు.. విభేదాలు.. చివరకు దాడులు.. హత్యలు.. ఆత్మహత్యలకు తెగబడుతున్నారు. అంతే కాక మద్యం సేవించడం వల్ల ఆరోగ్య సమస్యలు.. కుటుంబ ప్రతిష్ట దిగజారడం.. మానసిక ఒత్తిడి.. నిరాశ.. ఆందోళన వంటి సమస్యలకు దారి తీస్తోంది. మద్యపానం చేసే తల్లిదండ్రుల వల్ల వారి పిల్లలు కూడా మానసిక సమస్యలతో పాటు సామాజిక ఇబ్బందులకు గురవుతున్నారు.

భర్త వేధింపులు తాళలేక..

మద్యానికి బానిసగా మారిన భర్త వేధింపులు తట్టుకోలేక పాతనగరానికి చెందిన కనకమహాలక్ష్మి (20) ఆత్మహత్య చేసుకుంది. భర్త నిత్యం మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడు. ఎన్నిసార్లు పెద్దల సమక్షంలో మందలించినా తన వైఖరి మారలేదు. దీంతో విరక్తి చెందిన కనకమహాలక్ష్మి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

మద్యానికి బానిసై ఆత్మహత్య..

కొత్త జాలారిపేటకు చెందిన వీరేంద్ర (32) అల్లరి చిల్లరగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. తండ్రి చనిపోవడంతో కుటుంబ బాధ్యతల్ని గాలికి వదిలేశాడు. ఇంట్లో వాళ్లు మందలించారు. మనస్తాపం చెందిన వీరేంద్ర ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మత్తులో యాక్సిడెంట్..

స్కూల్ ఆటో డ్రైవర్ ఒకరు మద్యం మత్తులో డివైడర్‌ను ఢీకొట్టాడు. పూటుగా మద్యం సేవించి ఉన్న అతను మింది నుంచి పాతగాజువాక వైపు వెళ్తూ.. బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద సర్వీసు రోడ్డులో కాకుండా.. మద్యం మత్తులో అతివేగంగా జాతీయ రహదారి ఎక్కేసాడు. పాత గాజువాక సమీపిస్తుండగా బజాజ్ షోరూం వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న ఫార్మా కంపెనీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆరుగురు పాఠశాల విద్యార్థులు గాయపడ్డారు.

సంపాదించిందంతా మందుకే..

ఇలాంటి ఎన్నో ఘటనలు మద్యం వల్ల చోటు చేసుకుంటున్నాయి. మరీ ముఖ్యంగా దక్షిణ నియోజకవర్గంలో అధిక శాతం మంది పేద, బడుగు, బలహీన వర్గాల వారే. ఉదయం నుంచి సాయంత్రం పొద్దు పోయే వరకు కూలి పనులు చేసుకుని.. ఆ వచ్చిన ఆదాయాన్ని ఇంటికి ఇవ్వకుండా మద్యం దుకాణాలకే తగలెట్టేస్తున్నారు. ఇక పలువురు కూలీలు రోజంతా కష్టపడి పని చేసిన వారు కాసింత చుక్కేసి ఎక్కడ పడితే అక్కడే పడిపోతున్నారు. ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న అనేక పేద కుటుంబాలు మద్యం వల్ల తీవ్రంగా నష్టపోతున్నాయి. చిలకపేట, పద్మానగర్, కోటవీధి, అంబుసరంగ్‌వీధి, థామ్సన్ స్ట్రీట్, రెల్లివీధి, జబ్బర్‌తోట, పెయిందొరపేట, కదిరిదానప్పవీధి, ఫిషింగ్ హార్బర్ రోడ్డు, అల్లిపురం, జ్ఞానాపురం, ప్రసాద్‌గార్డెన్స్, వెలంపేట, బౌదారా రోడ్డు, కల్లుపాకలు ఇలా.. అనేక మురికి వాడ ప్రాంతాల ప్రజలు మద్యానికి బానిసై ఆర్థికంగా.. సామాజికంగా.. మానసికంగా కృంగి పోతున్నారు. కుటుంబ కలహాలతో రోడ్డున పడేవారు కొందరైతే.. ఆత్మహత్యలకు పాల్పడే వారు మరికొందరు. ఇప్పటికైనా ప్రజల్లో మార్పు వస్తేనే కుటుంబాలు సక్రమంగా ఉంటాయని పలువురు నిపుణులు చెబుతున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యంతో స్వాధీనం చేసుకున్న వాహనం

అల్లిపురం: పీడీఎస్ బియ్యం రవాణా చేస్తున్న వాహనాన్ని టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం టూటౌన్ ఎస్ఐ డి.రాముకు వచ్చిన సమాచారం మేరకు ఏపీ 39 టీబీ 7487 బొలేరో వాహనంలో అక్రమంగా పీడీఎస్ రైస్ తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గొల్లలపాలెం జంక్షన్ వద్దకు ఎస్ఐ రాము చేరుకున్నారు. వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 50 కేజీల బరువు గల 80 పీడీఎస్ రైస్ బ్యాగులు గుర్తించారు. దీంతో వాహనం డ్రైవర్ ఆళ్ల రాజును అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఎల్లమ్మతోటకు చెందిన కడుపు శ్రీను దగ్గర నుంచి బియ్యం తీసుకుని, పద్మనాభానికి చెందిన సంపంగి సూర్యనారాయణకు అప్పగించడానికి తీసుకెళ్తున్నట్లు వెల్లడించాడు. దీంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వాహనంతో సహా బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

విద్యుత్ రంగం ప్రైవేటీకరణ తగదు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

దాబాగార్డెన్స్: విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించొద్దని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న విశాఖలో ఏపీఈపీడీసీఎల్ పరిధిలో గల ఐదు జిల్లాల కార్మికులతో సదస్సు నిర్వహించనున్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న సదస్సుకు సంబంధించి బుధవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ప్రైవేట్, కాంట్రాక్ట్, పీస్‌రేట్ కార్మికులకు ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. పీఆర్‌సీలో జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులందర్నీ విద్యుత్ సంస్థలో విలీనం చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ చంద్రశేఖర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరశురామ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

24న మినీ బాలోత్సవం



మినీ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: ఆసరా చారిటబుల్ సొసైటీ వార్షిక సాధారణ సమావేశాన్ని పురస్కరించుకుని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మినీ బాలోత్సవం నిర్వహించనున్నట్టు ఆసరా అధ్యక్షురాలు సి. సునీత తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మినీ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా ఆమె మాట్లాడారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్‌తో కలిసి ఈ నెల 24న కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసరా గత మూడేళ్లుగా వీసీసీ ద్వారా నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్లు, క్లబ్ విద్యార్థులకు అకడమిక్, కల్చరల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తుందన్నారు. ఆయా సెంటర్ల ద్వారా రెగ్యులర్ చదువుతో పాటు ఏడాది పొడవునా వివిధ రకాల ఎక్స్‌ట్రా కరిక్యులం యాక్టివిటీస్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది ఆసరా వార్షిక సమావేశాన్ని పురస్కరించుకుని పిల్లల పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీసీసీ జిల్లా కన్వీనర్ కె. సుశీల మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి రెండో తరగతి వరకు సబ్ జూనియర్స్‌గా, 3 నుంచి 5వ తరగతి పిల్లలు జూనియర్స్‌గా, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు సీనియర్స్‌గా పరిగణించి ఈవెంట్స్ జరుగుతాయన్నారు. చిత్ర లేఖనం, కథ చెప్పడం, మెమరీ టెస్ట్, ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్, బృందగానం, జానపద బృంద నృత్యం, లఘు నాటిక, ఏకపాత్రాభినయం, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్, వ్యాస రచన, క్విజ్ వివిధ కేటగిరీల్లో పోటీలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 8309812422 నంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసరా కమిటీ సభ్యుడు శ్రీనాథ్, వీసీసీ కో ఆర్డినేటర్ సతీష్, ఆర్గనైజర్లు కల్యాణి, భవానీ, మణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న పద్మనాభరాజు

మద్దిపాలెం: చెన్నై రాష్ట్రం మధురైలో జరిగే సీపీఎం కార్మిక, కర్షక 24వ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు పద్మనాభరాజు కోరారు. జీవీఎంసీ 50వ వార్డు పరిధి మధవధార శ్రీమాధవ యువజన సమాజం దగ్గర జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అట్టడుగు ప్రజానీకం కోసం అనునిత్యం పని చేస్తున్న పార్టీ సీపీఎం అని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, నిరుద్యోగ సమస్యను తగ్గించాలని, పెరుగుతున్న ధరలను అదుపు చేయాలని ప్రభుత్వాలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, ప్రజల్ని చైతన్య పరుస్తూ పోరాటం నడిపేందుకు సీపీఎం పార్టీ 24వ మహాసభలను తమిళనాడు రాష్ట్రం, మధురైలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూన పార్వతి, అమ్ములమ్మ, జనార్దనమ్మ, సీతమ్మ, చిలకమ్మ, అనురాధ, భవాని, కె. సుధాకర్, ఎస్. రామగోపాలరావు, కూన వెంకటరావు, కూన సత్యనారాయణ, నాయుడు బాబు, జి.ఎస్. మూర్తి, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై అధికారుల దృష్టి

- సచివాలయ సిబ్బందికి టార్గెట్లు
- ఇంటింటా జల్లెడ పడుతున్న వైనం



ఆటోలో ప్రచారం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

విశాఖ విద్య: ఆస్తి పన్ను వసూళ్లపై జీవీఎంసీ అధికారులు ఫోకస్ పెట్టారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియడంతో ఇళ్లు, ఖాళీ స్థలాలు, వాణిజ్య సముదాయాల నుంచి లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేసేలా క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీనిలో భాగంగా సచివాలయ సిబ్బందికి పన్నుల వసూళ్ల బాధ్యతలు అప్పగించారు. ఆయా సచివాలయాల పరిధిలో ప్రతి రోజు ఎంత మేర బకాయిలు వసూళ్లు చేయాలనే టార్గెట్లు పెట్టి, మరీ ఉద్యోగులపై ఒత్తిడి పెంచారు. జీవీఎంసీ అధికారులు ప్రతీ రోజూ సాయంత్రం వేళలో దీనిపై సమీక్ష చేస్తుండటంతో సచివాలయ సిబ్బంది బకాయిల వసూళ్ల జోరు పెంచారు. ఇళ్లు, ఖాళీ స్థలాలు, వాణిజ్య సముదాయాల వారీగా బకాయిదారులను గుర్తించి, వారి నుంచి పన్నులు రాబడుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సర్దుబాటు కాలేదని, కొన్ని రోజులు గడువు కావాలని కొంతమంది యజమానులు కోరినా.. అదేం కుదరదన్నట్లుగా బకాయిదారుల మెడపై కత్తిపెట్టి మరీ పన్నుల వసూలు చేస్తున్నారు. జీవీఎంసీ అధికారుల ఒత్తిళ్లతో సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ ఆటోలపై తిరుగుతూ 'బకాయిలు కట్టకుంటే జప్తు చేస్తామని' హెచ్చరికలు చేస్తుండటంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పై అధికారుల ఒత్తిళ్లతో తమకు ఇలాంటి పరిస్థితులు తప్పడం లేదని సచివాలయ ఉద్యోగులు సైతం ఆవేదన చెందుతున్నారు.

దొండపర్తిలో కార్డన్ సెర్చ్



దొండపర్తిలో తనిఖీ చేస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణ

సీతమ్మధార: ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం దొండపర్తిలో ఈస్ట్ సబ్ డివిజన్ సిబ్బందితో కలిసి ఫోర్త్ టౌన్ సీఐ ఎ.సత్యనారాయణ పర్యవేక్షణలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా సరైన పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అలాగే ఇళ్లు, షాపులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 8 బృందాలతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. కిరణాషాపులు, పాన్‌షాపులు, ఇళ్లు తనిఖీలు చేసినట్లు తెలిపారు. రికార్డులు లేని ద్విచక్ర వాహనాలు తనిఖీ చేసి 18 వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు జి.వెంకటరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్జీమర్స్‌పై అవగాహన సదస్సు రేపు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ సౌజన్యంతో మతిమరుపు (అల్జీమర్స్)పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 5గంటలకు వుడాకాలనీ ఈస్ట్ పార్కులో స్థానిక పార్కు కమిటీ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అల్జీమర్స్‌కు కారణాలు, నివారణ మార్గాలపై ప్రముఖ వైద్యులు అవగాహన కల్పిస్తారని, వాకర్స్, ఇతర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందితో మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏలో సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు సిబ్బందిని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఇతర అధికారులు సన్మానించారు. సంస్థలో గత 36 ఏళ్లుగా పనిచేసిన పి.వీర్రాజు, పి.దుర్గాప్రసాద్ రిటైర్ అయ్యారు. బుధవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో వీరిని అధికారులు సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సంస్థలో 36 ఏళ్ల పాటు అంకితభావంతో విధులు నిర్వర్తించడం అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, సీఏఓ హరిప్రసాద్, డీఎఫ్ఓ శివానీ సుజాత, పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు చేతి వృత్తుల్లో ఉచిత శిక్షణ

ఆరిలోవ: ఆరిలోవ పాత పోలీస్ స్టేషన్ పక్కన ఉర్వి చారిటబుల్ ట్రస్ట్‌లో మహిళలకు చేతి వృత్తుల్లో ఉచితంగా వేసవి శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ కో ఆర్డినేటర్ హరి వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. గార్మెంట్ మేకింగ్, ఆర్యా వర్క్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగుల తయారీలో 2 నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులు జరుగుతాయని చెప్పారు. ఆసక్తి గల వారు సంస్థ ట్రైనర్‌ను 70934 29202 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యూటీఎస్ యాప్‌పై అవగాహన



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే అధికారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ జనరల్ టికెట్స్ మొబైల్ యాప్‌పై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు, ఈ యాప్ వినియోగించే వారికి 3 శాతం క్యాష్‌బ్యాక్ రాయితీ అందజేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. 2016లో జనరల్ టికెట్ బుకింగ్ యాప్‌ను ప్రారంభించినట్లు, ఈ యాప్ ద్వారా ప్లాట్‌ఫాం టికెట్లు, జనరల్ టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ యాప్‌పై సాధారణ ప్రయాణికులకు విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్లాట్‌ఫాంలపై మీడియా ద్వారా, పోస్టర్లు, పాంప్లెట్ల ద్వారా కూడా ప్రయాణికులకు తెలియజేస్తున్నారు. ఆర్-వ్యాలట్ రీచార్జి చేసుకుని, యూటీఎస్ అనే యాప్ ద్వారా సాధారణ రైలు టికెట్లు బుక్ చేసుకున్న వారికి 3 శాతం రాయితీ అందజేస్తున్నారు. ఈ రాయితీ 2025 ఆగస్ట్ 24వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఆండ్రాయిడ్, ఐవోఎస్, విండోస్ ఆపరేటింగ్ సిస్టం వాడుతున్న ప్రతి మొబైల్‌లో ఈ యాప్ ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

యూటీఎస్ యాప్ ద్వారా ప్రయోజనాలు..

- సాధారణ టికెట్ల కోసం కౌంటర్ల వద్ద లైన్‌లో నిల్చోవాల్సిన అవసరం ఉండదు
- టికెట్ల కోసం చిల్లర ఇవ్వాలనే సమస్య ఉండదు
- ఎక్కడి నుండైనా టికెట్లు బుక్ చేసుకోవచ్చు
- అందరికీ వీలుగా వివిధ భాషల్లో సేవలు
- సులభతరమైన నగదు రహిత చెల్లింపులు

'ప్రవాస సాహిత్యం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రఘురామారావు

సీతంపేట: ప్రవాస భారతీయుడు డాక్టర్ రమేష్ ప్రసాద్ రావెళ్ల (యూఎస్ఏ) రచించిన 'ప్రవాస సాహిత్యం' విమర్శనా వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ బుధవారం సాయంత్రం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు అధ్యక్షతన జరిగిన సభలో విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఘండికోట రఘురామారావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 55 ఏళ్ల క్రితం విశాఖ నుంచి యూఎస్‌కు వెళ్లి ఉన్నత స్థానాలు అధిరోహించినా, తెలుగు భాష, సాహిత్యంపై రమేష్ ప్రసాద్ మక్కువ వదల్లేదని కొనియాడారు. అక్కడి ప్రపంచం, భాష, దృక్పథం వేరైనా అవేవీ తనపై ప్రభావం చూపలేదని, చక్కగా తెలుగు మాట్లాడుతూ వందలాది వ్యాసాలు రాయడమే కాక, ప్రవాస సాహిత్యం పేరుతో విమర్శనాత్మక పుస్తకం రాయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. శిరేల సన్యాసిరావు మాట్లాడుతూ ఒక పేజీ రాయాలంటే వంద పేజీలు చదవాలని, ఒక విమర్శ చెయ్యాలంటే వెయ్యి పేజీలు చదవాలని, ఈ పుస్తకం రాయడానికి రమేష్ ప్రసాద్ ఎన్ని పుస్తకాలు చదివారో ఇట్టే అర్థం అవుతుందన్నారు. అనంతరం గాంధీ సెంటర్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ కె.వి.ఎస్. మూర్తి పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో హరిబాబు తమ్మినేని, మేడా మస్తాన్‌రెడ్డి, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఎస్సీ సంఘాలతో సమావేశం



మాట్లాడుతున్న డీడీ రామారావు

ఎంవీపీకాలనీ: జిల్లాలోని ఎస్సీ సంఘాలతో సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా ఎస్సీ కార్పొరేషన్లు సంయుక్తంగా బుధవారం సమావేశం నిర్వహించాయి. ఎంవీపీ కాలనీ సోషల్ వెల్ఫేర్ కార్యాలయంలోని బుద్ధ భవన్‌లో జరిగిన సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ సామాజిక వర్గానికి అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి విధి విధానాలు, ఇతర సదుపాయాలు, సౌకర్యాలపై ఆయా సంఘాల నాయకులకు అవగాహన కల్పించారు. లబ్ధిదారులైన ఎస్సీ కులాల వారు వాటిని వినియోగించుకోవడంలో సంఘాల నాయకులు సమన్వయకర్తలుగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ సంఘాల నాయకులు బి.కల్యాణావు, బూసి వెంకట్‌రావు, డీవీఎంసీ సభ్యులు పి.మల్లేశ్వర్‌రావు, సిహెచ్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: టెక్ మహీంద్ర సహకారంతో కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి క్యాంపస్‌లో పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు ఉండి, ఇంటర్, డిగ్రీ పాసైన విద్యార్థులకే హెల్త్ కేర్ బిల్లింగ్, జీడీఏ కోర్సుల్లో 3 నెలలు ఉచిత శిక్షణ ఇచ్చి అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు డిప్లొమో పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. వివరాలకు 7207953919, 7995013421 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.